ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు

• నగర ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : నగర నియోజకవర్గ పరిధిలో డివిజన్ల వారీగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని నగర ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్ పేర్కొన్నారు. నగరంలోని 51వ డివిజన్ పెద్దబావి సెంటర్, బండీలవారి సందు, బండి వీధి, తదితర ప్రాంతాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం ఆయన నిర్వహించారు. గడప గడపకు వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలు, ప్రజాసమస్యలపై ఆరాతీశారు. ఎవరైనా అర్హులై ఉండి సంక్షేమ పథకాలు అందకుంటే వెంటనే సమస్యను పరిష్కరించి అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరంలోని కపాడిపాళెంలో యుజీడీ లైన్లు, డ్రెయిన్లు, రోడ్లు నూతనంగా నిర్మించనున్నట్లు తెలిపారు. అందుకు సంబంధించి రూ.7 కోట్లతో అంచనాలు వేశామని వివరించారు. త్వరలో టెండర్లు పిలిచి అన్ని పనులు ప్రారంభించి పూర్తి చేస్తామన్నారు. డివిజన్ పరిధిలోని సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. డిప్యూటీ మేయర్ ఎండీ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్ సాహిత్య, వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

47వ డివిజన్ అభివృద్ధికి కృషి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని 47వ డివిజన్ అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తామని నగర ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్ పేర్కొన్నారు. నగరంలోని 47వ డివిజన్ కుక్కలగుంట ప్రాంతంలోని మహాలక్ష్మమ్మ గుడి సమీపంలోని సచివాలయం వద్ద రూ. 40 లక్షలతో చేపడుతున్న డ్రెయిన్, సీసీరోడ్డు నిర్మాణ పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ మాట్లాడుతూ 47వ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న డ్రెయిన్లు, సీసీరోడ్ల పనులను పూర్తి చేసేందుకు మరో రూ.60 లక్షలతో టెండర్లు పిలుస్తున్నామని తెలిపారు. గుప్తాపార్కు సెంటర్ నుంచి అజాద్ సెంటర్ వరకు సీసీరోడ్డు నిర్మాణ పనులకు త్వరలో శంకుస్థాపన చేస్తామన్నారు. నగర నియోజకవర్గ పరిధిలో 1000 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి సచివాలయాలకు అనుసంధానం చేయాలనే ఆలోచన చేస్తున్నామన్నారు. అందులో భాగంగా త్వరలో స్థానిక డివిజన్‌లో 35 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నగర నియోజకవర్గంలో ఎక్కడా పెండింగ్ పనులు లేకుండా నవంబర్, డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఎండీ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్ పొట్లూరి రామకృష్ణఆచారి, వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి చెత్త సేకరణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



శానిటరీ సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ వికాస్‌మర్మత్

నెల్లూరు సిటీ: ఇంటింటి చెత్త సేకరణ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కార్పొరేషన్ కమిషనర్ వికాస్‌మర్మత్ శానిటరీ సిబ్బందిని హెచ్చరించారు. కార్పొరేషన్ పరిధిలోని 21వ డివిజన్, మాగుంటలేవుట్ ప్రాంతంలో బుధవారం కమిషనర్ పర్యటించారు. పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. వీధుల్లో వ్యర్థాలు పేరుకుపోయి ఉండడం, ఇంటింటి చెత్తసేకరణలో నిర్లక్ష్యం వహించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. శానిటరీ కార్యదర్శుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పారిశుధ్య సిబ్బంది విధులకు అనుమతి లేకుండా గైర్హాజరైతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భవన నిర్మాణాలకు సంబంధించి ఇసుక, కంకర, ఇతర మెటీరియల్‌ను రోడ్లపై నిల్వ చేయడం గమనించి భవన యజమానులకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ఖాళీ ప్లాట్లలో నీరు చేరి దోమలు వ్యాప్తి చెందకుండా యజమానులకు నోటీసులు జారీ చేయాలని సూచించారు. పారిశుధ్యానికి నగర ప్రజలు సహకరించాలని కోరారు. ఇళ్ల వద్దకు చెత్త వాహనాలు వచ్చినప్పుడు చెత్తను అందజేయాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్తపడేస్తే ఉపేక్షించమని హెచ్చరించారు. కమిషనర్ వెంట ఎంహెచ్‌ఓ పీ వెంకటరమణ, శానిటరీ ఉద్యోగులు ఉన్నారు.

సీ ఫుడ్ ఫెస్టివల్ ఏర్పాట్ల పరిశీలన

రాష్ట్ర మత్స్యశాఖ, భూమి ఆర్గానిక్స్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని కస్తూరీదేవి గార్డెన్స్‌లో ఈ నెల 11 నుంచి మూడ్రోజుల పాటు నిర్వహిస్తున్న సీఫుడ్ ఫెస్టివల్ ఏర్పాట్లను కార్పొరేషన్ కమిషనర్ వికాస్‌మర్మత్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సీఫుడ్ ఫెస్టివల్‌కు కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. తాగునీరు, మొబైల్ టాయిలెట్స్, తదితర సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు. సీఫుడ్ ఫెస్టివల్ ప్రచారం కోసం ఫ్లెక్సీలు, హోర్డింగుల ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేశామని తెలిపారు.

స్పందన ఫిర్యాదులు పునరావృతం కాకుండా చర్యలు

నగర పాలక సంస్థ కార్యాలయంలో ప్రతి సోమవారం జరిగే స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులు తిరిగి పునరావృతం కాకుండా క్షేత్రస్థాయిలో అధికారులు పర్యవేక్షించాలని కమిషనర్ వికాస్‌మర్మత్ ఆదేశించారు. నగరంలోని పొదలకూరురోడ్డు, వీఆర్సీ కళాశాల, తదితర ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించారు. స్పందన సమస్యలను పరిశీలించారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలు వెంటనే పరిష్కరించాలని సూచించారు. కాగా విజయవాడ నుంచి రాష్ట్ర కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ పీ కోటేశ్వరరావు బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కమిషనర్ వికాస్ మర్మత్ పాల్గొన్నారు. జగనన్నకు చెబుదాం, ఆస్తి పన్ను, తాగునీటి సరఫరా, అక్రమ కట్టడాలు, జగనన్న శాశ్వత భూ హక్కు పథకం, రీ సర్వే, క్లాప్ కార్యక్రమం, సీజనల్ వ్యాధులు, కోర్టు కేసుల వంటి అంశాలపై చర్చించారు. కార్పొరేషన్ అదనపు కమిషనర్ శర్మద, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఎస్ఈ సంపత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(దర్గామిట్ట): ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో ఎన్‌జీఓ సంఘ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ నెల 21, 22 తేదీల్లో విజయవాడలో నిర్వహించనున్న ఏపీ ఎన్‌జీఓ మహాసభలకు హాజరుకావాలని ఎమ్మెల్యేను ఆహ్వానించారు. ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ ఆత్మకూరు తాలుకా అధ్యక్షురాలు బీ శైలజ, ప్రధాన కార్యదర్శి బీ చంద్రశేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ శ్రీధర్‌రావు, ట్రెజరర్ బీ సుప్రియ, అసోసియేట్ ప్రెసిడెంట్ ఆర్వీ సుబ్బయ్య, వైస్‌ప్రెసిడెంట్ ఉత్తయ్య, రామకృష్ణ, బషీరా, భాగ్యమ్మ, నరసింహులు, శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నాయకులు మొహ్మద్ ముజీబుల్లా, తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు ఉపాధ్యక్షుడి నియామకం



కోవూరు: వక్ఫ్ బోర్డు జిల్లా ఉపాధ్యక్షుడిగా కోవూరు మండలంలోని పడుగుపాడుకు చెందిన విశ్రాంత నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్ మేనేజర్ ఎస్‌కే షాజహాన్‌ను రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఉన్నతాధికారులు నియమించారు. ఇందుకు సహకారం అందించిన కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని బుధవారం షాజహాన్ కోవూరులో కలిసి పూలమొక్కను అందించారు. షాజహాన్ గతంలో వక్ఫ్ బోర్డు సభ్యుడిగా ఉన్నారు. కార్యక్రమంలో డీఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, పడుగుపాడు ఉప సర్పంచ్ ఎస్‌కే అహ్మద్, వార్డు సభ్యుడు రఫీ, హయద్, దావుద్, మౌలాలీ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: మోటార్‌బైక్ అదుపుతప్పడంతో ఓ వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని కసుమూరులో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. నెల్లూరులోని కోటమిట్టకు చెందిన షేక్ ఫయాజ్ పని నిమిత్తం బైక్‌పై కసుమూరుకు వెళ్లాడు. తిరిగి నెల్లూరుకు వెళ్తుండగా కసుమూరు మలుపు రోడ్డు వద్ద అడ్డు వచ్చిన ఆటోను తప్పించబోయే క్రమంలో బైక్ అదుపుతప్పి పడిపోయింది. ఈ ప్రమాదంలో ఫయాజ్‌కు గాయాలవడంతో చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు దాటుతుండగా..

బుచ్చిరెడ్డిపాళెం: రోడ్డు ప్రమాదంలో ఒకరు గాయపడిన ఘటన బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని రాజ్‌కిశోర్ సినిమా హాల్ వద్ద బుధవారం చోటు చేసుకుందిది. స్థానికుల కథనం మేరకు.. సుబ్బారావు అనే వ్యక్తి సినిమాహాల్ వద్ద ముంబై జాతీయ రహదారి దాటుతుండగా మోటార్‌బైక్‌పై వస్తున్న గుర్తుతెలియని వ్యక్తి ఢీకొట్టాడు. దీంతో సుబ్బారావు కాలికి గాయమైంది. అతడిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై పోలీస్‌లకు ఫిర్యాదు అందలేదు.

దోమల నివారణకు చర్యలు

• వైద్యాధికారి రామకృష్ణ



కొడవలూరు: దోమల నివారణకు చర్యలు తీసుకున్నామని, ఇందులో భాగంగా గంబూసియా చేపలను గుంతల్లో వదులుతున్నట్లు వైద్యాధికారి ఎం.రామకృష్ణ తెలిపారు. కొడవలూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కొడవలూరు, గుండాలమ్మపాళెం, పద్మనాభసత్రంలోని మురుగునీరు నిల్వ ఉన్న గుంతలు, కాలువల్లో బుధవారం గంబూసియా చేపలను వదిలారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ఆ చేపలు దోమల లార్వాను తినేస్తాయన్నారు. దీంతో దోమల ఉత్పత్తి తగ్గుతుందన్నారు. తద్వారా మలేరియా, చికెన్ గున్యా, డెంగీ లాంటి వ్యాధులు సోకకుండా నివారించవచ్చని చెప్పారు. ప్రభుత్వం దోమల నివారణకు గంబూసియా చేపలను పంపిణీ చేస్తోందన్నారు. ఒక్కో గుంతలో 1,500 నుంచి 2,000 చేపలను వదిలినట్లు వివరించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి నాగరాజు, వైద్యాధికారిణి గీతా సాహితి, సీహెచ్‌ఓ సోమశేఖర్, హెచ్‌ఎస్ రామ్మోహన్, హెచ్‌ఏ షఫీఉద్దీన్, స్టాఫ్ నర్సులు వెన్నెల, పద్మ, ల్యాబ్ టెక్నీషియన్ గ్రేస్ మేరీ, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవం



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, వల్లీదేవసేన కల్యాణోత్సవం

నెల్లూరు(బృందావనం): ఆడికృతిక సందర్భంగా మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని బుధవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఉదయం వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం దేవదేవేరులను నెమలి వాహనంపై కొలువుదీర్చి నగరోత్సవం నిర్వహించారు. రాత్రి వల్లీదేవసేన, సుబ్రహ్మణ్యస్వామిని విశేషంగా అలంకరించి శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. ఆలయ ఈఓ, ధర్మకర్తల మండలి చైర్మన్, సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఇరుకళల పరమేశ్వరి హుండీ కానుకల లెక్కింపు



కానుకలను లెక్కిస్తున్న భక్తులు

నెల్లూరు(బృందావనం): నగరంలోని ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో హుండీ కానుకల లెక్కింపును బుధవారం నిర్వహించారు. ఏప్రిల్ 26 నుంచి ఆగస్టు 9వ తేదీ వరకు భక్తులు అమ్మవారి హుండీల్లో సమర్పించిన కానుకలను లెక్కించగా రూ.8,43,368 ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ మల్లికార్జునరెడ్డి తెలిపారు. హుండీ లెక్కింపును ఆలయ చైర్మన్ ఆర్ శ్రీనివాసరావు, అల్లూరు పోలేరమ్మ ఆలయ ఈఓ చిట్టిబాబు, దేవాదాయశాఖ నెల్లూరు ఇన్‌స్పెక్టర్ సుధీర్ పర్యవేక్షించారు.

20న మాదిగల చైతన్య ర్యాలీ



మాట్లాడుతున్న పందింటి సుబ్బయ్యమాదిగ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): మాదిగల రాజకీయ చైతన్యం కోసం నగరంలో ఈ నెల 20న మాదిగల చైతన్య యాత్రను నిర్వహించనున్నట్లు సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పందింటి సుబ్బయ్యమాదిగ తెలిపారు. నగరంలోని అంబేడ్కర్‌భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చి ఏడు దశాబ్దాలు అవుతున్నా, మాదిగలకు రాజకీయ ప్రాధాన్యం దక్కడం లేదన్నారు. ఎస్సీ కమిషన్ చైర్మన్‌తో పాటు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే పదవుల్లో మాదిగలకు ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నేతలు వెంకటరావు, కన్యకేశ్వరరావు, వెంకటరమణయ్య, రఘు, ప్రసాద్, మల్లికార్జున్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకం అందరి బాధ్యత

• వీఎస్‌యూ వీసీ జీఎం సుందరవల్లి



వెంకటాచలం: మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న వీఎస్‌యూ వీసీ

వెంకటాచలం: 'మొక్కల పెంపకం అందరి బాధ్యత. నాటడమే కాకుండా సంరక్షించాలి.' అని వీఎస్‌యూ వీసీ జీఎం సుందరవల్లి పిలుపునిచ్చారు. మండలంలోని కాకుటూరు వద్దనున్న వీఎస్‌యూలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నా భూమి - నా దేశం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. వీసీ ముఖ్యఅతిథిగా హాజరై మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మొక్కలు నాటడం ద్వారా భావితరానికి మంచి ప్రపంచాన్ని ఇవ్వగలుగుతామని చెప్పారు. ఈ సందర్భంగా విశ్రాంత ఆర్మీ అధికారి ఎన్ ఎం రావును శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి, ప్రిన్సిపల్ విజయానంద్‌కుమార్ బాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఉదయ్‌శంకర్, డాక్టర్ సునీత, డాక్టర్ విద్యాప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ సివిల్ జడ్జిగా ఆత్మకూరు న్యాయవాది



మందల లిఖిత

ఆత్మకూరు: రాష్ట్ర హైకోర్టు ఇటీవల నిర్వహించిన జూనియర్ సివిల్ జడ్జి పరీక్ష ఫలితాల్లో ఆత్మకూరుకు చెందిన న్యాయవాది మందల లిఖిత జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. ఆత్మకూరు బార్ అసోసియేషన్‌లో మెంబర్‌గా ఉన్న ఈమె పలు కేసుల్లో ప్రతిభ చూపారు. ఈ క్రమంలో జూనియర్ సివిల్ జడ్జి డిపార్ట్‌మెంట్ నిర్వహణ పరీక్షలకు హాజరై ఓపెన్ కేటగిరీలో ఎంపికైంది. ఈ సందర్భంగా ఆమెను ఆత్మకూరుకు చెందిన న్యాయవాది నందా ఓబులేసు తదితరులు అభినందించారు. కాగా లిఖిత స్వగ్రామం ఆత్మకూరు మండలం గండ్లవేడు. ఆమె తండ్రి బ్యాంకు ఉద్యోగిగా పని చేస్తున్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత



చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): ఆత్మకూరు మండలం కరటంపాడుకు చెందిన పఠాన్ జిలానీబేగం మోకాళ్ల శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఆమె కుటుంబ పరిస్థితి బాగా లేని కారణంగా సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా రూ.55వేల చెక్కు మంజూరైంది. ఈ చెక్కును ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి నగరంలోని తన కార్యాలయంలో జిలానిబేగం కుటుంబ సభ్యులకు బుధవారం అందజేశారు. మర్రిపాడు మండల జేసీఎస్ కోఆర్డినేటర్ వల్లభనేని రాజేంద్రనాయుడు పాల్గొన్నారు.


నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

నెల్లూరు రూరల్: నగరంలోని నెల్లూరు రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ ప్రజావేదికను గురువారం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలేంద్రకుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరు రూరల్ మండల పరిధిలోని 18 పంచాయతీల్లో చేపట్టిన ఉపాధి పనులను పరిశీలించి సామాజిక తనిఖీ బృందాలు గుర్తించిన అవకతవకలపై చర్చించనున్నట్లు వివరించారు.

వ్యక్తిపై దాడి చేసి నగదు దోపిడీ

నెల్లూరు రూరల్: మోటార్‌సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని గుర్తుతెలియని వ్యక్తులు అటకాయించి దాడి చేసి నగదు అపహరించుకెళ్లారు. ఈ ఘటన పొట్టేపాళెం కలుజు సమీపంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు..బుచ్చిరెడ్డిపాళెం మండలం మినగల్లుకు చెందిన సాయిసుమంత్ నెల్లూరులోని డీమార్ట్‌లో పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి రోజులాగే తన పనులు ముగించుకుని ఇంటికి మోటార్ సైకిల్‌పై వెళుతున్నాడు. ఈ క్రమంలో పొట్టెపాళెం కలుజు సమీపంలో ఆరుగురు గుర్తుతెలియని వ్యక్తులు అటకాయించి దాడి చేసి అతని వద్ద ఉన్న నగదు, సెల్‌ఫోన్‌ను లాక్కుని పరారయ్యారు. ఈ మేరకు బాధితుడు రూరల్ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశాడు.

పండ్ల పంపిణీ



నెల్లూరు(బృందావనం): పాత మున్సిపల్ కార్యాలయంలోని పట్టణ నిరాశ్రయుల కేంద్రంలోని నిరాశ్రయులకు జిల్లా ముస్లిం యూత్ సేవా కమిటీ అధ్యక్షుడు షేక్ ఖాలిద్ ఆధ్వర్యంలో బుధవారం పండ్లు పంపిణీ చేశారు. రొట్టెల పండగను విజయవంతంగా నిర్వహించిన అధికారులు, ప్రజాప్రతినిధులకు అభినందనలు తెలుపుతూ ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ముక్తియార్, కేంద్రం మేనేజర్ సుందరం, తదితరులు పాల్గొన్నారు.

డీకేడబ్ల్యూలో నా భూమి –నా దేశం



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

నెల్లూరు (టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నా భూమి–నా దేశం కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వసుధా వందన్, పంచ్‌ప్రాణ్ ప్రతిజ్ఞ, వీర సైనికులకు వందనం చేసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం జెండా వందనం సమర్పించారు. ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ సునీల్‌కుమార్, విశ్రాంత ఆర్మీ ఆఫీసర్ భాస్కర్, ఎన్‌సీసీ హవల్దార్ కందన్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐఓ, కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు, ఎన్ఎస్ఎస్ అధికారులు కరుణకుమారి, ప్రసన్న, భారతి, అధ్యాపకులు రవీంద్రనాథ్, వెంకటేశ్వర్లు, రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వక్తృత్వ, వ్యాసరచన పోటీలు



బహుమతులు పొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

నెల్లూరు (టౌన్): హిరోషిమా, నాగసాకి డేను పురస్కరించుకుని ఏసీనగర్‌లోని మల్లెల సంజీవయ్య మున్సిపల్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ప్రపంచ శాంతి–భావి భారత పౌరుల ఆకాంక్ష అనే అంశంపై వక్తృత్వ, చిత్రలేఖన, వ్యాసరచన పోటీలను బుధవారం నిర్వహించారు. రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం ప్రపంచ శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి జిల్లా విషయ నిపుణులు ప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచ మానవాళి సంక్షేమానికి అణ్వాయుధాల కంటే అన్నవస్త్రాలే ముఖ్య అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం హైమావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమరయోధుల త్యాగం చిరస్మరణీయం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): భారత స్వాతంత్ర్య సమరయోధుల త్యాగం చిరస్మరణీయమని ఆవాజ్ జిల్లా కార్యదర్శి రషీద్ పేర్కొన్నారు. నగరంలోని డా.జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో మూడ్రోజుల పాటు నిర్వహించిన సమరయోధుల చిత్రపటాల ప్రదర్శన మంగళవారం రాత్రితో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడ్రోజుల పాటు సమరయోధుల చిత్రపటాలను ప్రదర్శించగా రూ.3వేల మందికిపైగా విద్యార్థులు తిలకించారని తెలిపారు. సమరయోధుల స్ఫూర్తిని విద్యార్థుల్లో నింపేందుకు ఈ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. ఇదే విధంగా జిల్లా వ్యాప్తంగా స్వాతంత్ర్య సమరయోధులు చిత్రపటాల ప్రదర్శనను నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ చిత్రకారుడు నసీర్ అహ్మద్, డా.ఖాజారసూల్, మహ్మద్‌గౌస్, ఆవాజ్ జిల్లా కమిటీ అధ్యక్షుడు రఫీ, సభ్యులు రియాజ్, బాషా,సర్దార్, అజీజ్, తదితరులు పాల్గొన్నారు.

సోమిరెడ్డిని విచారిస్తే గ్రావెల్ మాఫియా బట్టబయలు



మాట్లాడుతున్న మందల వెంకటశేషయ్య

నెల్లూరు(దర్గామిట్ట): సర్వేపల్లి నియోజకవర్గంలోని కనుపూరు చెరువుకు సంబంధించిన గ్రావెల్ మాఫియాపై మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని పోలీసులు విచారిస్తే అన్ని విషయాలు బట్టబయలవుతాయని జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య పేర్కొన్నారు. మాగుంటలేఅవుట్‌లోని జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రావెల్ దొంగను దాచి సోమిరెడ్డి పతివ్రతలా మాట్లాడుతున్నారన్నారు. అక్రమంగా గ్రావెల్‌ను తరలిస్తున్న బుచ్చినాయుడు వెనుక సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఉన్నారని టిప్పర్ ప్రమాదంలో రుజువైందన్నారు. కనుపూరు చెరువు నుంచి రైతులకు మట్టి తోలుతున్నామని అనుమతులు తీసుకుని నెల్లూరుకు బుజ్జినాయుడు గ్రావెల్ తరలిస్తున్నాడని ఆరోపించారు. గుడూరువారిపాళెం ఘటనపై స్టేషన్‌లో పడుకున్న సోమిరెడ్డి వెంటనే బుజ్జినాయుడి వ్యవహారంపై స్పందించాలన్నారు. సోమిరెడ్డి తన ఇంట్లోనే గ్రావెల్ మాఫియా దొంగకు ఆశ్రయమిచ్చారని ఆరోపించారు. సోమిరెడ్డిని విచారిస్తే గ్రావెల్ మాఫియా వెనక ఎవరు ఉన్నారో పోలీసులకు పూర్తి వివరాలు తెలుస్తాయన్నారు. టిప్పర్ ప్రమాదంలో బ్యాంకు ఉద్యోగి చనిపోతే తొలుత తమకు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో సోమిరెడ్డి పోస్టులు పెట్టించారని తెలిపారు. ప్రమాదానికి కారణమైన వాహనం టీడీపీ నేత బుజ్జినాయుడిది అని తెలిసి వెంటనే ఆ పోస్టులను తొలగించారని తెలిపారు. జాకీలు పెట్టి లేపినా సర్వేపల్లి నియోజకవర్గంలో టీడీపీ రాదని ఆ పార్టీ నాయకులే కథలు కథలుగా చెప్పుకుంటున్నారన్నారు. తమ నాయకుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి వెంట నడిస్తే రాజకీయ భవిష్యత్తు ఉంటుందని టీడీపీ నాయకులు కూడా వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకుంటున్నారని తెలిపారు. వైఎస్సార్‌సీపీలో చేరికలను చూసి ఓర్వలేక సోమిరెడ్డి ఇష్టమొచ్చినట్లుగా మాట్లాడుతున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా గ్రీవెన్‌సెల్ అధ్యక్షుడు తలమంచి సురేంద్రబాబు, టీపీగూడూరు మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్ పాల్గొన్నారు.